సాక్షి
మంచిర్యాల

శనివారం : 25 : ఫిబ్రవరి : 2023



అన్నాచెల్లెళ్ల కళ్లలో వెలుగులు

తల్లిదండ్రులు దూరమైన అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్ల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో దాతలు ముందుకొచ్చి ఆదుకుంటున్నారు. 8లో▸



కాలగర్భంలోకి కేకే-1గని

కేకే-1గని కాలగర్భంలో కలిసిపోనుంది. మూడు తరాల వారికి ఉపాధినిచ్చి ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది. 64ఏళ్లలో 10మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీశారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /17.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాలి



పాల్గొన్న కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల నిర్దేశిత లక్ష్యాలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అటవీ, గ్రామీణాభివృద్ధి, వైద్య, ఆరోగ్యశాఖ, వ్యవసాయ, ఉద్యానవన, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ శాఖల అధికారులతో కంటి వెలుగు, నివాస స్థలాలు ప్రొఫార్మా-1, పట్టణ ప్రాంతాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్లు, జీవో 58, 59, 118 అమలు, పోడు భూములు, ఆయిల్ పామ్, సమీకృత కలెక్టరేట్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు పురోగతిలో ఉన్నాయని, లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, బి.రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి పాల్గొన్నారు.

'పొగాకు వినియోగంతో అనారోగ్యం'



పోస్టర్లను విడుదల చేస్తున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వల్ల అనారోగ్యం బారిన పడుతారని, పొగాకు మానేసేలా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవల్ కోఆర్డినేషన్ కమిటీ(డీఎల్‌సీసీ)ని 13 ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసి నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం(ఎన్టీసీపీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ పొగాకు వాడకుండా తీసుకొచ్చిన పలు సెక్షన్లను వివరించారు. పొగాకు వాడడం వల్ల కలిగే అనర్థాల పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి విజయపూర్ణిమ, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల పాల్గొన్నారు.

బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం అడ్డగింత

- మాజీ ఎంపీ వివేక్‌ను నిలదీసిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గొడవ



వివేక్‌కు వ్యతిరేకంగా నినాదాలు

చెన్నూర్: మండలంలోని సుద్దాల గ్రామంలో ప్రజాగోస బీజేపీ భరోసా, శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ, బీజేపీ కోర్‌కమిటీ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. ఎంపీగా ఉన్న సమయంలో చెన్నూర్ మండలానికి ఏం చేశావంటూ నిలదీశారు. ఈ నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఓ చానల్ రిపోర్టర్ కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటన తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి పంపించడంతో ఘర్షణ వాతావరణం సద్దుమణిగింది. అనంతరం బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భూమి లీజు డబ్బులేవి..!



పైపుల తరలింపును అడ్డుకున్న మహేశ్



నెన్నెల మండలం మైలారం నుంచి లారీల్లో తరలిస్తున్న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పైపులు

- ప్రాణహిత పైపుల తరలింపు అడ్డగింత
- కొడుకుతో కలిసి రైతు నిరసన
- మరోసారి నిలిచిపోయిన పైపుల రవాణా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కథ కంచికి చేరడంతో ఆ ప్రాజెక్టు నిర్మాణ పైపుల తరలింపు వివాదాస్పదంగా మారుతోంది. ఇక్కడి రైతులకు భారీ సాగునీటి ప్రాజెక్టు లేకుండా పోయిందనే అసంతృప్తికి తోడు ఏళ్లుగా పైపులు నిల్వ చేసిన భూముల్లో పరిహారం ఇవ్వకుండా తీసుకెళ్లడంపై అడ్డుకోవడం జరుగుతోంది. తాజాగా నెన్నెల మండలం మైలారానికి చెందిన రైతు కొమ్ము నాగయ్య కాంట్రాక్టర్ ఇంకా తనకు డబ్బులు చెల్లించాల్సి ఉందని తన కొడుకు మహేశ్‌తో కలిసి భూముల నుంచి వెళ్తున్న లారీలను అడ్డుకున్నాడు. 2017వరకే రెండు ఎకరాలకు లీజు చెల్లించి ఇప్పటివరకు భూమి వాడుకుని పరిహారం చెల్లించలేదని నిరసన వ్యక్తం చేశారు. దీంతో శుక్రవారం మరోసారి పైపుల తరలింపు నిలిచిపోయింది. మొదట్లో లారీల రాకపోకలతో విద్యుత్ వైర్లు తెగిపోవడం, రోడ్లు ధ్వంసం కావడం, రోడ్డు ప్రమాదం, దుమ్ము ధూళి కారణంగా పలుమార్లు రైతులు, స్థానికులు నిరసన తెలిపారు. దీంతో మైలారం గ్రామ పంచాయతీకి రూ.5లక్షలు నష్టపరిహారం కింద కాంట్రాక్టర్ చెల్లించడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత తగ్గింది. అడ్డుకున్న ప్రతీసారి స్థానిక పోలీసులు జోక్యంతో తరలింపు నడుస్తోంది.

ప్రాణహిత ఆగిపోయి...

కుమురంభీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి ప్రాణహిత నది వద్ద 2007లో చేపట్టిన ప్రాజెక్టు 21ప్యాకేజీలతో రూ.38వేల కోట్లతో నిర్మించి ఉమ్మడి జిల్లాలో 2లక్షల ఎకరాలకు నీరందించాలని ప్రణాళిక వేశారు. ఇందులో భాగంగా తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు 70కిలోమీటర్లు కాలువలు తవ్వాల్సి ఉంది. ఆసిఫాబాద్, మంచిర్యాల పరిధిలో ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీ 5లో 17.9కిలోమీటర్లు పైపులైన్ నిర్మాణంలో భాగంగా, 3.6డయామీటర్ ఎంఎస్(మైల్డ్ స్టీల్) పైపులు వాడాల్సి ఉంది. కుమురంభీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం కాకముందే, 4.9కిలోమీటర్లు పైపులైన్ కోసం భారీ కాలువలు తవ్వి ఏర్పాటు చేశారు. మరో 13కిలోమీటర్లు పైపులైన్ వేయాల్సి ఉంది. రూ.350కోట్లు వెచ్చించారు. తెలంగాణ ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌తో కాళేశ్వరం తెరపైకి రావడంతో ప్రాణహిత పక్కకు పోయింది. అప్పటివరకు జరిపిన నిర్మాణ ఖర్చులు ప్రభుత్వం చెల్లించింది. తవ్విన కాలువలు, భవిష్యత్‌లో వార్ధా బ్యారేజీకి ఉపయోగపడుతాయని వాదనలు వచ్చినా కార్యరూపం దాల్చలేదు.

రైతుల అడ్డగింత..

ఇక్కడి రైతాంగానికి తీరని నష్టం జరిగిందని పైపుల తరలింపును పలుమార్లు అడ్డగించారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం శివారులో రైతుల భూముల నుంచి తీసుకెళ్తున్నారు. ఇందులో పైపులు తమ భూమిలో వేసుకునేందుకు అద్దె చెల్లించే ఒప్పందం ఉంది. సకాలంలో ప్రాజెక్టు పూర్తయితే కాంట్రాక్టరు సైతం చెల్లించేవారు. కానీ ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోవడంతో పైపులు అలాగే పడి ఉన్నాయి. తాజాగా ఈ పైపులు తరలిస్తుండగా లీజు తీసుకున్న రైతులు అడ్డగించారు. కొంత మంది తిరిగి లీజు చెల్లించడంతో తమ భూముల నుంచి తీసుకెళ్లేందుకు ఒప్పుకున్నారు. దీనిపై పైపుల తరలింపు ఇన్చార్జీని ఫోన్‌లో సంప్రదించాలని ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదు. ఇక పైపుల తరలింపులో పలుమార్లు రైతులు అడ్డుకున్నా ప్రజాప్రతినిధులెవరూ స్పందించడం లేదు. రూ.వందల కోట్ల విలువైన సామగ్రి జిల్లా ప్రజానీకానికి ఉపయోగపడకుండా పోవడంపై అభ్యంతరాలు ఉన్నాయి.

మూడో టీఎంసీ పనులకు..

ఎనిమిదేళ్లుగా వృథాగా ఉన్న రూ.350కోట్ల విలువైన వందలాది పైపులను తిరిగి వినియోగించుకునేందుకు సాగునీటి శాఖ తరలిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మూడో టీఎంసీ ఎత్తిపోసేందుకు ఎల్లంపల్లి వరద కాలువకు 20కిలోమీటర్లు, మిడ్‌మానేరు నుంచి మల్లన్న సాగర్ వరకు 20నుంచి 25కిలోమీటర్ల మేర పైపులైన్ వేస్తున్నారు. ఈ పనుల కోసమే జిల్లా నుంచి పైపులు భారీ వాహనాల్లో తరలిపోతున్నాయి. వందలాది పైపులు ఉండడంతో నెలల తరబడి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో స్థానికంగా ఎటువంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు ముందే చేసుకున్నారు.

అప్రమత్తతతో తప్పిన ముప్పు



మ్యాప్ ద్వారా పరిస్థితిని తెలుసుకుంటున్న డైరెక్టర్ శ్రీనివాస్

- ఎస్సార్పీ 3 గనిలో గ్యాస్ కట్టడి
- గోడలు కట్టి మంటలు ఆర్పిన రెస్క్యూ టీం
- 72 గంటలపాటు పరిశీలన
- రెండు షిఫ్టులకు లే ఆఫ్



గనిలోకి దిగుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: యాజమాన్యం అప్రమత్తతతో ఎస్సార్పీ 3గనిలో జరిగిన గ్యాస్ ప్రమాదం ముప్పు తప్పింది. గురువారం మొదటి షిఫ్ట్ సమయంలో 34వ డిస్ట్రిక్ట్‌లో లూజ్‌కోల్ ఆక్సిడేషన్ అయ్యి మంటలు చెలరేగి కార్బన్ మోనాక్సైడ్(సీవో) వెలువడడం తెలిసిందే. గురువారం రాత్రి నుంచి రెస్క్యూ టీం ఆపరేషన్స్ మొదలుపెట్టడం, రెండో షిఫ్ట్‌కు వచ్చిన ఉద్యోగులు రెస్క్యూ ఆపరేషన్‌కు అవసరమైన సామగ్రి సకాలంలో గనిలోకి చేర్చడం వల్ల శుక్రవారం ఉదయం వరకు శ్రమించి గ్యాస్‌ను కట్టడి చేశారు.

గోడలు కట్టి గ్యాస్ దిగ్బంధనం

34 డిస్ట్రిక్ట్ 6 లెవల్ సౌత్, 44 డేస్‌లో 19 స్క్వేర్ మీటర్స్ ఏరియాలో బొగ్గు అంటుకుంది. గురువారం సాయంత్రం నుంచే రెస్క్యూ టీం యంత్రాలు, గనిలోని నీటి పంపులతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. చివరికి ఆ ప్రాంతాన్ని వాయు దిగ్బంధనం చేశారు. బొగ్గు మండడానికి ఆక్సిజన్ అవసరం. ఆక్సిజన్ అందకుంటే మంట ఆరిపోతుందని ప్రమాద ప్రాంతానికి గాలి వెళ్లకుండా ఐదు చోట్ల గొడలు కట్టి ఉదయం 8.40గంటలకు సీల్ చేశారు. తర్వాత ఎగ్జాస్ట్ ఫ్యాన్ వద్ద గ్యాస్ డిటెక్టర్లతో కార్బన్ మోనాక్సైడ్ వస్తుందా అని పరిశీలించి అదేమి లేదని అధికారులు గుర్తించారు. డీజీఎంఎస్ ఆదేశాలతో సేఫ్టీ నిబంధన ప్రకారం సీల్ చేసిన ఏరియాను 72 గంటలపాటు పరిశీలనలో ఉంచారు. ప్రతీ 24 గంటలకోసారి గ్యాస్ నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. లోపల ఎలాంటి ఫైర్ లేదని ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

గనిపైనే అధికారుల మకాం..

అధికారులు గనిపైనే మకాం వేసి ఎప్పటికప్పుడు రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం రాత్రి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి స్వయంగా గనిలోకి దిగారు. పరిస్థితిపై అధికారులకు సూచనలు చేశారు. శుక్రవారం ఉదయం డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్ గనిని సందర్శించి మేనేజర్ కార్యాలయంలో పరిస్థితిని సమీక్షించి ప్రమాదాన్ని తగ్గించడంపై పలు సూచనలు చేశారు. కంపెనీ సేఫ్టీ జీఎం కే.గురువయ్య, రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, శ్రీరాంపూర్ జీఎం ఎం.సంజీవరెడ్డి, రెస్క్యూ సూపరింటెండెంట్ రాంమోహన్, ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోష్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రెండు షిఫ్టులకు లేఆఫ్..

శుక్రవారం ఉదయం షిఫ్ట్ వరకు డ్యూటీకి వచ్చిన ఉద్యోగులు లోపల గోడలు కట్టడానికి సర్ఫేస్‌లో ఉన్న ఇటుకలు, ఇతర మెటీరియల్ సరఫరా, ఇతర సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గోడలు కట్టడంతో మధ్యాహ్నం, రాత్రి షిఫ్టులకు కంపెనీ లే ఆఫ్ ప్రకటించింది. శనివారం ఉదయం 8.40 గంటలకు ఫైర్ సీల్స్ నుంచి నమూనాలు సేకరించి గని లే ఆఫ్ పొడగించడమా లేదా అనేది నిర్ణయిస్తారు.

15 ఏళ్ల క్రితం ఆర్కే న్యూటెక్ గనిలో..



మూసివేసిన ఆర్కే న్యూటెక్ గని ఎగ్జాస్ట్(ఫైల్)

ఈ ప్రమాదం 15 ఏళ్ల క్రితం ఆర్కే న్యూటెక్ గనిలో జరిగిన గ్యాస్ ప్రమాదాన్ని గుర్తు చేసింది. 2008, జూలై 14న పెద్దయెత్తున గ్యాస్ వచ్చి గనిని కొన్ని నెలలపాటు మూసివేశారు. కార్మికులను వేరే గనులకు బదిలీ చేశారు. గనిలో చాలా యంత్రాలు కాలిపోయాయి. అప్పుడు అది కంపెనీలోనే అతిపెద్ద దుర్ఘటనగా మిగిలిపోయింది. ఆ తర్వాత గని తెరిచారు. ప్రస్తుతం గ్యాస్ కట్టడి కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదమేమి లేదు..

ప్రస్తుతానికి ప్రమాదమేమీ లేదు. 72 గంటలపాటు పరిశీలనలో ఉంచాం. ఎగ్జాస్ట్ ఫ్యాన్ వద్ద గ్యాస్ నమూనాలు పరిశీలిస్తే నార్మల్ రికార్డు ఉంది. శనివారం ఉదయం మరోసారి పరిస్థితిని సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం. ఆందోళన చెందాల్సినదేమీ లేదు. **– జీఎం బీ.సంజీవరెడ్డి**

సింగరేణి ప్రైవేటీకరణను తిప్పికొట్టాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- సమీకృత కలెక్టరేట్ నిర్మాణం పరిశీలన

నస్పూర్: సింగరేణి సంస్థ ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని, కార్మికులంతా సమష్టిగా సంస్థను కాపాడుకునేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం పనులను ఎంపీ బోర్లకుంట వెంకటేష్, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 15లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదిపై మంచిర్యాల-అంతర్గాం వంతెన నిర్మాణానికి ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేయనుందని తెలిపారు. కలెక్టరేట్ భవనం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం, మంచిర్యాల-అంతర్గాం వంతెన నిర్మాణం, చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి త్వరలోనే సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం..

చెన్నూర్/జైపూర్/భీమారం/మందమర్రిరూరల్: అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. శనివారం ఆయన జైపూర్, భీమారం, మందమర్రి, చెన్నూర్ మండలాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జైపూర్ మండలంలో రూ.5.5కోట్లతో సీసీ రోడ్లు, మెటల్ రోడ్లు, భీమారం మండల కేంద్రంలో రూ.3.50కోట్లతో సీసీ రోడ్లు, మందమర్రి మండలం ఆదిల్‌పేట గ్రామంలో రూ.2కోట్లతో మెటల్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెన్నూర్‌లోని పద్మనగర్ కాలనీలో రూ.12.60కోట్లతో మన ఊరు-మన బడి అభివృద్ధి చేపట్టగా సుమన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఎంపీపీలు గోదారి రమాదేవి, గుర్రం మంగ, మంత్రి బాపు, జెడ్పీటీసీలు మేడి సునీత, వేల్పుల రవి, మోతె తిరుపతి, చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న విప్, ఎంపీ, ఎమ్మెల్యేలు

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్

నస్పూర్/మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట: జిల్లాలోని పట్టణాల్లో ప్రజలు మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణాల్లో నెలకొన్న సమస్యలు, వీధి కుక్కలు, కోతుల బెడద, వీధి దీపాలు పని చేయకపోవడం, పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలపై ఆయా మున్సిపాల్టీల కమిషనర్ల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోరవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

నేడు..
లక్సెట్టిపేట మున్సిపాల్టీ
కమిషనర్ : ఆకుల వెంకటేష్
సంప్రదించాల్సిన నంబరు :
98499 54456
సమయం : శనివారం ఉదయం
9 గంటల నుంచి 10 గంటల వరకు



నేడు..
నస్పూర్ మున్సిపాల్టీ
కమిషనర్ : టీ.రమేశ్
సంప్రదించాల్సిన నంబర్:
98662 37358



నేడు..
మంచిర్యాల మున్సిపాల్టీ
కమిషనర్ : జి.రాజు
సంప్రదించాల్సిన నంబరు :
98499 05886



సమయం: శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సమస్యల పరిష్కారానికి కృషి

- చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ జి.గంగాధర్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన
- సమస్యలను వివరించిన పట్టణ ప్రజలు
- పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికపై సమావేశం

సాక్షి ఫోన్ ఇన్



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ గంగాధర్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ప్రజలు, పాలకవర్గ సభ్యుల సహకారంతో స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతానని చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ జి.గంగాధర్ అన్నారు. వీధి కుక్కలు, కోతుల బెడద, తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాలతోపాటు తదితర ప్రజా సమస్యలపై శుక్రవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో ఉదయ ఫోన్ ఇన్ నిర్వహించింది. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొనసమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఓపిగా విన్న ఆయన అన్నింటినీ నమోదు చేసుకున్నారు. అనంతరం ఫోన్ ఇన్‌లో తన దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరితగతిన పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రశ్న: 4వ వార్డులో ఇరువై రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. రాజీవ్‌రోడ్డులోనూ నీటి సమస్య ఉంది. **– తగరం నరేశ్, 4వ వార్డు, సద్దనపు వెంకటేష్, రాజీవ్‌రోడ్డు**

కమిషనర్: ఈ విషయం నా దృష్టికి రాలేదు. కాలనీలో పర్యటించి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు కృషి చేస్తా. పందుల సంచారంపై పెంపకందారులతో మాట్లాడి ఊరికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. రాజీవ్‌రోడ్డులో నీటి సమస్యను అధికారులతో మాట్లాడి రెండ్రోజుల్లో పరిష్కరిస్తా.

ప్రశ్న: రోడ్డు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. **– కె.సదానందం, చీర్ల సుధాకర్‌రెడ్డి, విశ్వకర్మ కాలనీ**

కమిషనర్: లయోల పాఠశాల పక్కన గల విశ్వకర్మ కాలనీలో రోడ్డు నిర్మాణానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చూస్తా.

ప్రశ్న: డ్రెయినేజీ నిర్మించినా లాభం లేకుండా పోయింది. **– మహ్మద్ ఇమ్రాన్‌ఇందిరానగర్ కాలనీ, 6వ వార్డు**

కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో రూ.80 లక్షల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో డ్రెయినేజీ నిర్మించారు. కింది భాగం నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: మటన్ మార్కెట్ అస్తవ్యస్తంగా మారింది. **– సంగీతపు విజయ్‌కృష్ణ, మార్కెట్ రోడ్డు**

కమిషనర్: మటన్, చికెన్ వ్యాపారులు వ్యర్థాలను ఇష్టారాజ్యంగా బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చర్యలు తీసుకుంటా. పెడచెవిన పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయి.

ప్రశ్న: డ్రెయినేజీ తవ్వి వదిలేశారు. డ్రెయినేజీ లేక ఇబ్బందులు పడుతున్నాం. **– మహ్మద్ హాజీపాషా, మహ్మద్ ఎజాస్, లైన్‌గడ్డ**

కమిషనర్: కొత్తగా బాధ్యతలు చేపట్టాను. కాలనీలో పర్యటించి డ్రెయినేజీ కారణంగా ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతాం. డ్రెయినేజీలు లేని చోట్ల ఇబ్బందులు ఉంటాయి. కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించి పరిష్కారం అయ్యేలా చూస్తాం.

ప్రశ్న: గెర్రె కాలనీలో చెత్త తొలగించడం లేదు. హైవే పక్కనే చెత్తాచెదారం వేస్తున్నారు. **– జిల్లాల నారాయణ, గెర్రెకాలనీ, మారగొని మధుకర్‌గౌడ్, పుప్పాల హనుమాన్ వీధి**

కమిషనర్: పారిశుధ్య జవాన్‌తో మాట్లాడి గెర్రె కాలనీలో నిత్యం చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటా. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి హైవేలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రోడ్డు పైనే విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. **– రాసపాక శ్రీశైలం, ఎంపీడీవో ఆఫీస్ వెనుకాల**

కమిషనర్: విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలను మార్పు చేయిస్తాం.

ప్రశ్న: కోతులతో వేగలేకపోతున్నాం.. **– సుధీర్, పిల్లలమర్రి రాజబాపు, మెయిన్‌రోడ్డు**

కమిషనర్: ఉన్నతాధికారులతో మాట్లాడి కోతులను సంరక్షణ కేంద్రాలకు పంపించే ఏర్పాటు చేస్తా.

ప్రశ్న: అక్రమ కట్టడాలు, ఇంటి పన్నులు **– సుశీల్‌కుమార్, జంషీడ్, ఆశ రవీందర్, మహ్మద్ నిజాముద్దీన్**

కమిషనర్: నేను కొత్తగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. అనుమతి లేకుండా ఓపెన్ ప్లాట్లలో అక్రమంగా కట్టాడాలు, ఇంటి నంబర్లు కేటాయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. ఇంటి కొలతల ప్రకారం పన్నులు వసూలు చేస్తాం. పన్నుల వసూలులో సిబ్బంది తప్పు చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

పేదలకు అందని రేషన్ బియ్యం

- జిల్లాలో 78 శాతమే పంపిణీ
- ముగిసిన పంపిణీ గడువు



రేషన్ బియ్యం(ఫైల్)

మంచిర్యాలటౌన్: జిల్లాలోని రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఫిబ్రవరి నెల కోటా బియ్యం పూర్తి స్థాయిలో పంపిణీ కాలేదు. ఈ నెల 24వరకు పంపిణీ చేయాల్సి ఉండగా సకాలంలో చేరకపోవడంతో పంపిణీ చేయనట్లు తెలుస్తోంది. ప్రతీ నెల ఐదో తేదీ నుంచి 20వరకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. కానీ దుకాణాలకు బియ్యం సకాలంలో చేరపోవడంతో ఆలస్యమవుతోంది. గత డిసెంబర్‌లో ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సరఫరా చేసే హమాలీలు సమ్మెబాట పట్టారు. ఆ నెలలో 79.55శాతం మాత్రమే బియ్యం పంపిణీ కాగా, ఫిబ్రవరిలో హమాలీలు పని చేస్తున్నా 78శాతం మాత్రమే పంపిణీ కావడం గమనార్హం. జిల్లాలో 423 రేషన్ దుకాణాలు ఉండగా ఫిబ్రవరిలో 2,19,677 కార్డుదారులకు 2,952 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా.. గడువు ముగిసే సమయానికి 1,71,868 కార్డుదారులకు బియ్యం పంపిణీ పూర్తయింది. ఈ పాస్ ద్వారా బియ్యం సరఫరా చేస్తుండగా ఈ నెల 24వరకు గడువు పొడిగించినా అనుకున్న మేర పంపిణీ జరగలేదు. మందమర్రి, మంచిర్యాల, భీమారం మండలాలకు దాదాపుగా 685 క్వింటాళ్ల బియ్యం అందించలేదు. కాగా, ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్పందిస్తూ అన్ని రేషన్ దుకాణాలకు బియ్యం పంపిణీ చేశామని చెప్పారు. బియ్యం తీసుకోని లబ్ధిదారులకు అవకాశం కల్పించేందుకు మరోసారి గడువు పెంచాలని ఉన్నతాధికారులను కోరామని తెలిపారు.

సరఫరా కాలేదు..

మందమర్రిరూరల్: మందమర్రిలోని ఎనిమిది దుకాణాలకు బియ్యం సరఫరా కాలేదు. పట్టణంలో 35 రేషన్ దుకాణాలు ఉండగా.. 28, 43, 45, 46, 47, 56, 58, 64 నంబర్ల దుకాణాలకు శుక్రవారం వరకు బియ్యం రాలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

కల్వర్టులో కారు.. తప్పిన ప్రమాదం



అదుపుతప్పి కల్వర్టులో బోల్తా పడిన కారు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్లలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా ఉన్న చిన్న కల్వర్టులో అదుపు తప్పిన ఓ కారు బోల్తా పడింది. మంచిర్యాల నుంచి హాజీపూర్ వైపు వెళ్తున్న కారు శుక్రవారం ఉదయం ఒక్కసారిగా అదుపు తప్పడంతో ఇరుకుగా ఉన్న రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి చిన్న గాయాలు కాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వారు ఓ శుభకార్యానికి వంట చేసేందుకు వెళ్తున్నట్లు సమాచారం.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



పగలగొట్టిన బీరువా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అశోక్‌నగర్ బస్తీలో తాళం వేసి ఉన్న ఓ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు కన్నం వేశారు. బాధితుడి కథనం ప్రకారం ... అశోక్‌నగర్ బస్తీలో నివాసముంటున్న దాసారం ఎల్లయ్య అనే రిటైర్డు ప్రిన్సిపాల్ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బంధువుల పెళ్లికి వెళ్లారు. ఎల్లయ్య కొడుకు తిరుపతి ఇంట్లో ఉండగా గురువారం ఇంటికి తాళం వేసి నైట్ డ్యూటీకి వెళ్లాడు. శుక్రవారం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లో వెళ్లి చూసేసరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో బిత్తరపోయాడు. బీరువాలోని 5తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి ఆభరణాలు, రూ.10వేల నగదు దోచుకెళ్లారు. వన్‌టౌన్ అదనపు ఎస్సై రాములు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం పరీక్షలకు 344 మంది విద్యార్థులకు గాను 331మంది హాజరు కాగా13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు 223మందికి 218 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

కాలగర్భంలోకి కేకే-1 గని

- 64 ఏళ్లలో 10మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీత
- మరో 30వేల టన్నులు తీసే అవకాశం
- మూడు తరాల వారికి ఉపాధినిచ్చిన గని
- ఎన్నో అవార్డులు ఆ గని సొంతం



మందమర్రి ఏరియాలోని కేకే-1 గని ముఖద్వారం

మందమర్రిరూరల్: సింగరేణి సిగ నుంచి మరో మూడు నెలల్లో మందమర్రి ఏరియాలోని కేకే-1 (కళ్యాణిఖని వన్ ఇంక్‌లైన్) భూగర్భగని కాలగర్భంలో కలిసిపోనుంది. 63సంవత్సరాల క్రితం ప్రారంభమై మూడు తరాల వారికి ఉపాధినిచ్చిన కేకే-1 గని 10వేల మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. సంస్థ నిబంధనల ప్రకారం మరో మూడు నెలల్లో సుమారు 30వేల బొగ్గు నిలువలను బయటకు తీసే అవకాశం ఉందని, అలాగే ఇంకా 0.154 మిలియన్ టన్నుల బొగ్గు నిలువతో మరో ఐదేళ్ల వరకు బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నా నిబంధనల ప్రకారం భూ ఉపరితలంపై ఉన్నటువంటి పరిస్థితుల వలన బొగ్గు వదలాల్సి వస్తోందని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఈ గనిలో విధులు నిర్వహించే 476 మంది ఉద్యోగులను మందమర్రి ఏరియాలోనే సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు 22మంది మేనేజర్లు పనిచేసిన సింగరేణి వ్యాప్తంగా ఎన్నో అవార్డులు సాధించిన కేకే-1 గనిపై ప్రత్యేక కథనం.

1956లో కేకే-1 గని ప్రస్థానం ప్రారంభం

బెల్లంపల్లి రీజియన్‌ని మందమర్రి ఏరియాలో కేకే-1 భూగర్భగని (కళ్యాణి ఖని వన్ ఇంక్‌లైన్) పురుడు పోసుకుంది. 1959వ సంవత్సరం నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించిన ఆ గని 63 ఏళ్లు నిర్విరామంగా బొగ్గు ఉత్పత్తి నిచ్చింది. 424. 33 హెక్టర్ల పరిధిలో వెలికి తీయడానికి అవకాశం ఉన్న సుమారు 10.160 మిలియన్ టన్నుల బొగ్గు నిలువలను గుర్తించిన అప్పటి అధికారులు 3, 4 సీముల ద్వారా బొగ్గు వెలికి తీయడానికి ప్లాన్ అందించారు. 69 లెవల్స్ వరకు (సుమారు రెండు కిలో మీటర్లు) హెడ్డింగ్ పనులుతో బొగ్గు ఉత్పత్తి చేసి తిరిగి 79 డిపిల్లరింగ్ ప్యానల్ సిస్టమ్ ద్వారా బొగ్గు గనుల నిబంధనల ప్రకారం ఇప్పటి వరకు 10.006 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీశారు. ఇంకా మూడు నెలల్లో సుమారు 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉందని గని అధికారి తెలిపారు. ప్రస్తుతం ఇందులో ఉద్యోగులు, కార్మికులు కలిపి 476 మంది పని చేస్తున్నారు.

ఎన్నో రికార్డులు..

ఏరియాలోని కేకే-1 భూగర్భ గనికి ఎన్నో అవార్డులు సాదించిన ఘన చరిత్ర ఉంది. 2021- 22 ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్షా 60వేల టన్నుల లక్ష్యానికి లక్షా 82 వేల బొగ్గు ఉత్పత్తి అంటే 114 శాతం సాధించి సింగరేణి రికార్డు సాధించింది. 2016వ సంవత్సరంలో సంస్థ నిర్వహించిన రక్షణ వారోత్సవాల్లో భాగంగా నాలుగవ గ్రూపుల్లో సింగరేణి వ్యాప్తంగా రెండో స్థానం దక్కించుకుంది. 2018, 2022వ సంవత్సరాల్లో సింగరేణి వ్యాప్తంగా బెస్ట్ ఎస్డీఎల్ మెయింటనెన్స్ అవార్డు, 2017లో బెస్ట్ ఫిట్ సేఫ్టీ అవార్డు, సేఫ్టీ వీక్ సంబురాల్లో నాల్గో గ్రూపు నుంచిమొదటి స్థానం, 2019లో రోప్ హాలేజ్ సిస్టమ్‌లో సింగరేణి వ్యాప్తంగా నాల్గోవ గ్రూపు వి భాగంలో రెండో స్థానం దక్కించుకుంది. 2007 -08 ఆర్థిక సంవత్సరంలో 1.27 ఓఎంఎస్ అత్యధికంగా సాధించింది. 2008 సెప్టెంబర్‌లో 13వేలా 7వందల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి 24.87 టన్నుల బొగ్గు ఉత్పత్తి అంటే 177.3శాతం సాధించి రికార్డు నెలకొల్పింది.

ఉద్యోగులను సర్దుబాటు చేస్తాం



మందమర్రి ఏరియాలోని కేకే-1 భూగర్భ గనిలోని బొగ్గు నిలువలు ఇంకా మూడు నెలల వరకు ఉత్పత్తి తీయగలము. గనిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను మందమర్రి ఏరియాలోని ఇతర గనుల్లో, విభాగాల్లో సర్దుబాటు చేస్తాం. ఎవరికైనా ఇష్టంతో ఇతర ఏరియాలకు వెళ్లాలనుకుంటే పరిశీలిస్తాం.

– చింతల శ్రీనివాస్, జీఎం, మందమర్రి ఏరియా

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాక్ పిలుపు మేరకు కాగజ్‌నగర్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ కోకన్వీనర్ ఎమ్మాజీ సతీష్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 2022 మార్చి 31తో వేతన సవరణ గడువు ముగిసినప్పటికీ యాజమాన్యం వేతన సవరణ చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 28 వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపడుతామని, యాజమాన్యం స్పందించకుంటే మార్చి 24 వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అప్పటికీ స్పందన రాకుంటే వచ్చే నెల 24న విద్యుత్ సౌదా ఎదుట జరిగే మహా ధర్నాలో భవిష్యత్ కార్యాచరణకు రాష్ట్ర కమిటీ పిలుపు నిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్, కె.శ్రీనివాస్, రాములు, ప్రతాప్, తిరుపతి, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): భూపాలపల్లి ఏరియాలో సింగరేణి యాజమాన్యం అక్రమంగా డిస్మిస్ చేసిన కార్మికులను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో శుక్రవారం కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీ మేనేజర్‌తో పాటు గోలేటి టౌన్‌షిప్‌లో జీఎంకు వినతిపత్రాలు అందచేశారు. వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అనారోగ్యం బారిన పడిన కార్మికులు విధులకు సక్రమంగా హాజరు కావటం లేదని నెపంతో ఒకే నెలలో భూపాలపల్లి ఏరియాలో 47 మంది కార్మికులను డిస్మిస్ చేయటం అత్యంత దుర్మార్గమన్నారు. విధులకు హాజరు కాని కాలానికి వేతనాలు చెల్లించనప్పుడు యాజమాన్యం కార్మికులను డిస్మిస్ చేయకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ సింగరేణి యాజమాన్యం మాత్రం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. సింగరేనిలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌ల ఖాళీలు ఉన్నప్పుడు అనారోగ్యం బారిన పడిన వాళ్లకు అవకాశం కల్పించకుండా అవినీతికి పాల్పడి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు లంచాలు ఇచ్చిన వారికే సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా అవకాశం కల్పించారని అన్నారు. కేటీకే 8 గనిలో ప్రమాదానికి మైనింగ్ సర్దార్‌ను బాధ్యుడిని చేస్తూ డిస్మిస్ చేశారన్నారు. కార్మికుల హక్కుల కోసం, సింగరేణి పరిరక్షణ కోసం, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలకు కార్మికులంతా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి రాజిరెడ్డి, పత్తెం రాజాబాబు, సురేందర్, రమేష్, ఎండీ చాంద్‌పాషా, మణిరాంసింగ్, దేవి సత్యం, జైపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం దిశగా..

- స్త్రీనిధి రుణాల లక్ష్యం చేరువకు చర్యలు
- ఈ ఏడాది లక్ష్యం రూ.126.79.కోట్లు
- ఇప్పటివరకు ఇచ్చినవి రూ.71 కోట్లు

స్త్రీనిధి లోగో..

దండేపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు, బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు, స్త్రీనిధి ద్వారా కూడా రుణాలు అందిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో 10,155 సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరానికి, స్త్రీనిధి ద్వారా రూ. 126.79 కోట్లు రుణాలు అందించే లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో ఇప్పటి వరకు రూ.71 కోట్లు రుణాలు అందించారు. మిగిలిన రూ.55.79 కోట్లు లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

స్త్రీనిధి ద్వారా అందించే రుణాలు..

స్త్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడం కోసం, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుకు, వీటితో పాటు వ్యాపార అభివృద్ధికి రుణాలు అందించనున్నారు. అందులో రుణ పథకాలు సువిధ స్కీం ద్వారా రూ. 5వేల నుంచి రూ.40వేల వరకు, ప్రగతి స్కీం ద్వారా రూ.40 వేలనుంచి రూ.75 వేల వరకు, అక్షయ ద్వారా రూ.75వేల నుంచి రూ.1.25 లక్షవరకు, సౌభాగ్య స్కీం ద్వారా రూ.1.25 లక్ష నుంచి రూ.3లక్షల వరకు అందించనున్నారు. రుణాలను 24 నెలలు, 48, నెలలు, 60 నెలల కాల వ్యవధిలో నెలవారీ వాయిదాలలో చెల్లించుకునే అవకాశం ఉంది. స్త్రీనిధి రుణాల ద్వారా ఇప్పటి వరకు జిల్లాలోని పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని, ఆర్థిక అభివృద్ధి చెందడంతో పాటు, తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి..



స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక అభివృద్ధి సాధించాలి. మంచిర్యాల జిల్లాలో ఈ ఏడాది రూ.126.79 కోట్లు లక్ష్యం పెట్టుకోవడం జరిగింది. అందులో ఇప్పటి వరకు రూ.71 కోట్లు అందించాం. మిగిలిన వాటిని మార్చి 25లోగా పూర్తి చేసి, లక్ష్యాన్ని పూర్తిచేస్తాం.

-వెంకటరమణ, స్త్రీనిధి ఆర్ఎం

వైఎస్ఆర్ టీపీ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా రాంచందర్

ఆదిలాబాద్‌టౌన్: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా గట్టు రాంచందర్‌రావును నియమిస్తూ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల రెడ్డి తెలిపారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. అదే విధంగా వైఎస్ఆర్ పార్టీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్న బెజ్జంకి అనిల్‌కుమార్‌ను మెదక్ జిల్లా పరిశీలకులుగా నియమించారు.

నేటి నుంచి రైళ్లు పునఃప్రారంభం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మీదుగా నడవాల్సిన పలు రైళ్లు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 17నుంచి రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ, పుష్పుల్, సింగరేణి, రామగిరి రైళ్లు తిరిగి 25 నుంచి పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. రైల్వే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఎల్ఎం అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సహకారంతో జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) అభ్యర్థులకు శుక్రవారం ఉచిత శిక్షణ శిబిరాన్ని ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ ప్రారంభించారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పూర్తి చేసి జేఎల్ఎం ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న 30 అభ్యర్థులకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జీఎస్ఆర్ ఫౌండేషన్ రాజారమేష్, ట్రైనింగ్ ఆఫీసర్ రమేష్, జేసీఐ అధ్యక్షుడు జేసీ రాజు, ప్రభుత్వ ఐటీఐ కరీంనగర్ ప్రిన్సిపాల్ కవిత, జగిత్యాల ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి, ట్రెయినర్ వెంకటేశ్వర్లు, డీటీవో హఫీజ్, సీనియర్ అసిస్టెంట్ ఆశరాణి పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

భీమారం: గ్రామాల్లోని జీవాల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం జీవాలకు నట్టల నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాంసం వినియోగం పెరగడంతో దానికి తగ్గట్టు గొర్రెలు, మేకలను పెంచే వారి కుటుంబాలు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. నట్టల నివారణకు గొర్రెలు, మేకల కాపరులు చొరవ చూపి టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రాకేశ్‌శర్మ, భీమారం సహకార సంఘం అధ్యక్షుడు ఆవుల సురేష్ పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్ల కోసం సర్టిఫికెట్లు అందజేయాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల కోసం సదరం సర్టిఫికెట్ అవసరం ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేసి ఈ నెల 25లోగా అందజేయాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పేరు, ఎంప్లాయిస్ ఐడీ, డిజిగ్నేషన్, పనిచేసే పాఠశాల, మండలం, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు, డిసిబులిటీ ఆఫ్ ద పర్సన్ ఇండికేట్ డీటెయిల్స్‌తో వివరాలు నమోదు చేసి డీడీవో ద్వారా డీఈవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

అన్నాచెల్లెళ్ల కళ్లలో వెలుగులు



దుస్తులు అందిస్తున్న తహసీల్దార్



కూలర్, దుస్తులు అందిస్తున్న యువకులు

- సాయం చేయడానికి ముందుకొస్తున్న దాతలు
- నరుకులు, దుస్తులు, నగదు అందజేత
- వచ్చే నెల నుంచి రేషన్ బియ్యం సైతం..

సాక్షి ఎఫెక్ట్..

దహెగాం: తల్లిదండ్రులకు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్ల కళ్లల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. ఆ నలుగురు అన్నాచెల్లెళ్లపై 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే..చెల్లెళ్ల కడుపు నిండేది' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పెద్ద ఎత్తున దాతలు ముందుకొచ్చి సాయం చేస్తున్నారు. మూడో రోజు శుక్రవారం సైతం పలువురు దాతలు వారికి నగదుతో పాటు, దుస్తులు, నిత్యావసర సరుకులు, ఓ కూలర్‌ను అందజేశారు.

రేషన్ బియ్యం అందిస్తాం

మండలంలోని చౌక గ్రామానికి చెందిన అనాథలైనా సిడాం రాజు, మమత, దీపిక, దివ్యలకు ఏడాదిగా రేషన్ బియ్యం అందడం లేదనే కథనం శుక్రవారం ప్రచురితం కావడంతో తహసీల్దార్ మధుకర్ స్పందించారు. చిన్నారులను స్థానిక తహసీల్ కార్యాలయానికి పిలిపించి వారికి నిత్యావసర సరుకులతో పాటు కార్యాలయ సిబ్బంది కలిసి రూ.5వేల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్నా చిన్నారుల వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ బియ్యానికి దూరమయ్యారని, ఆధార్ కేంద్రానికి పంపించి వేలిముద్రలను అప్‌డేట్ చేయిస్తామన్నారు. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ బియ్యం అందుతాయని తెలిపారు. మమతను దహెగాం కేజీబీవీలో, దీపిక, దివ్యలను కుంటలమానెపల్లి ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామన్నారు. చిన్నారుల తండ్రి సిడాం సత్తయ్య పేరును ఉన్న అరఎకరం భూమిని కుమారుడు సిడాం రాజు పేరున విరాసత్ చేసి ఇస్తామని తెలిపారు.

దుస్తులు అందజేత..

మండలంలోని కల్వాడ గ్రామానికి చెందిన యువకులు దుస్తులు, కూలర్‌ను అందజేశారు. అదే విధంగా మరికొంత మంది కూడా తోచిన సాయం చేస్తామని ముందుకొచ్చారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన వాసవి రైస్‌మిల్లు ఆధ్వర్యంలో వంట సామగ్రి అందజేశారు. మరికొంత మంది దాతలు సాయం చేయడానికి ముందుకొచ్చారు. అలాగే మంచిర్యాల జిల్లా సామగూడెం గ్రామానికి చెందిన యువకులు నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో అనాథలైన గిరిజన బిడ్డల కళ్ళల్లో వెలుగులు కనిపిస్తున్నాయి.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి



ఇందారం ఓపెన్‌కాస్టు గనిపై ప్రాజెక్టు ప్లాన్ వివరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

- సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్

జైపూర్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఓపెన్‌కాస్టు గనిని శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా గని ప్లాన్ అధికారులు వివరించారు. రోజువారి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ఓబీ వెలికితీత లక్ష్యాలన ఛేదించాలని తెలిపారు. పని ప్రాంతంలో పూర్తిస్థాయిలో రక్షణ పరికాలను వినియోగిస్తూ బొగ్గు ఉత్పత్తి సాధనకు పాటుపడాలని తెలిపారు. అనంతరం గోదావరి నది చుట్టూ నిర్మించిన కరకట్టను పరిశీలించారు. ఓపెన్‌కాస్టు గనిలోకి నీరురాకుండా గోదావరి చుట్టూ నిర్మించిన కరకట్ట దానికి చేపట్టాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రవికుమార్, గని ఆపరేషన్ మేనేజర్ బ్రహ్మాజీ, గని ప్రాజెక్టు ఇంజినీర్ రమేశ్, డీజీఎం శివరావు, సర్వే అధికారి సంపత్, సినియర్ సెక్యూరిటీ అధికారి మురళీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ పథకం కింద ప్రతీ ఇంటికి శుద్ధజలం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, సీఈ జ్ఞానకుమార్, నీటి పారుదల శాఖ ఈఈ అంజన్‌రావు, ఈఈ(గ్రిడ్) మధుసూదన్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణతో కలిసి మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సైతం తాగునీటి సరఫరా జరిగే విధంగా చూడాలని తెలిపారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దెబ్బతిన్న పైప్‌లైన్లు, లీకేజీల మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

చిన్నారుల పెళ్లి

- ప్రేమించుకుని..గుడిలో పెళ్లి చేసుకుని..
- మూడు మాసాలుగా సహజీవనం..
- ఆ తర్వాత పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి..
- అడ్డుకున్న అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): అవును వాళ్లిద్దరు ఇష్టపడ్డారు.. చదువుకునే వయస్సుల్లో పెళ్లి చేసుకున్నారు.. తల్లిదండ్రులకు తెలిస్తే అడ్డుకుంటారని ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. అనంతరం మూడు మాసాలుగా అబ్బాయి ఇంట్లో సహజీవనం సాగించారు. మళ్లీ శుక్రవారం పెద్దల సమక్షంలో అక్షింతలు వేశారు. ఆ విషయం ఆ నోటా.. ఈ నోటా అధికారులు దృష్టికి వెళ్లగా వారు చేరుకుని అమ్మాయిని సఖీ సెంటర్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కెరమెరి మండలంలోని ఖైరీ గ్రామానికి చెందిన 15ఏళ్ల అమ్మాయి.. 19ఏళ్ల అబ్బాయి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఎవరికి తెలియకుండా మూడు మాసాల క్రితం గుడిలో పెళ్లి చేసుకుని ఆ తరువాత ఇంట్లో చెప్పారు. చేసేదేమిలేక అమ్మాయి అబ్బాయి ఇంట్లో ఉంటోంది. సంప్రదాయ ప్రకారం పెళ్లి కాకుండా ఒకేచోట ఉండడం మంచిది కాదని భావించిన పెద్దలు శుక్రవారం అక్షింతలు వేసి పెళ్లి తంతును ముగించారు. విషయం తెలుసుకున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ కార్యకర్త ప్రవీణ్‌కుమార్, కెరమెరి ఏఎస్సై ఉల్లాస్ పెళ్లి మండపానికి చేరుకుని అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తాత్కాలిక వసతి కోసం అమ్మాయిని సఖీ కేంద్రానికి అప్పగించారు. బాలల సంక్షేమ సమితి ఆదేశాలు వచ్చే వరకు అమ్మాయి సఖీ సెంటర్‌లో ఉండనుందని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బాలిక మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా, దసరా నుంచి పాఠశాలకు వెళ్లడం లేదని తెలిసింది.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మంచిర్యాలటౌన్: ఏదైనా ఇష్టపడి చదవాలని, కష్టంగా ఉందనే ఆలోచన మాని, ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం సాధ్యమవుతుందని తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.నారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల దశ నుంచే మంచి ప్రణాళికను ఏర్పాటు చేసుకుని చదివితే ఉన్నత స్థితికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కోసం ఎమ్మెస్సీ, ఎంఏ సైకాలజీ అభ్యసించిన వారు 9963539025, 9848822052 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, నగర ప్రముఖ సైకాలజిస్టు శశికిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పచ్చదనం–పరిశుభ్రతపై శుక్రవారం నిర్వహించిన గ్రీన్ ఆడిట్‌లో ఏ గ్రేడ్ దక్కింది. పర్యావరణ పరిరక్షణతోపాటు మొక్కల పెంపకం, చెట్ల వృద్ధి, వృథా నీటిని సద్వినియోగం చేసుకోవడం, వంద శాతం ఎల్ఈడీ బల్బుల వినియోగం, సోలార్ లైట్ల వినియోగం, చెత్త నుంచి ఎరువు తయారీ, ఇంకుడు గుంతల ఏర్పాటుకు ఈ గౌరవం లభించింది. గ్రీన్ ఆడిట్ సభ్యుడు ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా పరిశీలించి కళాశాలకు ఏ గ్రేడ్ ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, న్యాక్ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, గ్రీన్ ఆడిట్ కన్వీనర్ కిశోర్‌కుమార్, సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, ప్రేమలత, మహేష్‌కుమార్, రసూల్, మహాత్మా సంతోష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.